కథా నిలయం
శ్రీకాకుళం

# కాటుక కంటినీరు

మెలకువ రాగానే లేచి పడకపైన కూర్చుంది సుమిత్ర. కూర్చోగానే లోపలికి వీస్తున్న ప్రాతర్మందానిలం ఆమెను పలకరించింది. కిటికీ కవతలి తోటలో అప్పుడే వికసించిన పువ్వులు బ్రతుకంటే భయం లేని పసివాళ్ళకుమల్లే పిల్ల తెమ్మెరలతో ఆడుకుంటున్నాయి. బ్రాని మల్లిచెట్టు కొమ్మల్లో నుంచీ పడమటి కొండ రొమ్ముపైన పాలిపోతున్న నెలవంక కన్పిస్తూంది. పడుకోబోతూ తగ్గించి పెట్టిన దీపం గదిలో ఇంకా సన్నగా వెలుగుతూంది. ఆ వెలుగులో కాలెండరు వైపు చూచింది సుమిత్ర. ఆగస్టు నెల, ఇరవై ఆరో తారీఖు. శుక్రవారం. ఏమిటో తన పిచ్చిగానీ ఈ కాపురంలో తన కన్నిరోజులూ ఒకలాగే ఉన్నాయి. చిరుతరగల మువ్వల గలగలలతో అందాలను కుస్తరించుకుంటూ, ఆనందాలను విస్తరించుకుంటూ సాగిపోయే సెలయేటి నడకలా ఉండటం లేదీ బ్రతుకు. ఇది చీకటిలా స్తంభించిపోయింది. ఈ చీకటిలో ఒక్క ఆశాకిరణమైనా కనిపించడం లేదు.

చీమ చిటుక్కుమంటే ఉలికిపడి, వడగాలి విసురుకే గడగడలాడిపోయే పిరికితనాల ప్రోవుగాదు సుమిత్ర. ఆమె చీమకుర్తి రెడ్ల ఆడుపడుచు. మనిషన్న తర్వాత వానిలో మంచీ చెడూ రెండూ ఉండక తప్పదు. చీమకుర్తి రెడ్లు నిఖార్సయిన మనుషులు. అయినవాడికి గుండె కోసి ఇచ్చినా, కాని వాడి గుండెల్లో కైజారులుగా బ్రతికినా తమకే చెల్లుననిపించుకున్న దండిగుండెల మగసిరిరాయళ్లు వాళ్లు. ఇటు మెట్టినింటి వాళ్లయినా సామాన్యులు కారు. వీళ్లూ పది ఊళ్లల్లో తమ మాటకు తిరుగు లేకుండా బ్రతికి పదిమందికి పెట్టిపోసిన వాళ్లే. ఈనాటికీ బండినిండుకూ వడ్లమూట లెత్తించి మిషనులో దంపించుకొస్తే ఆ బియ్యం రెండు వారాలకు చాలదు. మందికీ మార్బలానికీ తక్కువలేదు. అందుకు తగ్గట్టుగా ఆదాయంలోనూ లోటులేదు. కానీ భగవంతుడు చూచిన చిన్నచూపు? అదే వచ్చిన లోటు.

సుమిత్ర కింకా ఇరవైమూడేళ్లు నిండలేదు. నాలుగేళ్ల క్రిందట ఒకనాడు తిరుచానూరు అలివేలుమంగమ్మ సన్నిధానంలో పందిళ్లు వేయించి బాజాలు మ్రోగించడంతో విద్యార్థిని

సుమిత్ర గృహిణి సుమిత్రగా మారిపోయింది. పరకాయ ప్రవేశంలాంటి అనుభవం! స్టౌమీద కాఫీ కాచుకుని బుడిగంత పాత్రలో కుంపటి మీద గుజ్జనగూళ్ళ వండుకోడానికి సుమిత్రది బొమ్మరింటి కాపురంగాదు. పది మడకల సేద్యం, అయిదుగురు పాలేళ్ళు, పైరు నాటకమనీ, పంటకోతలనీ, గానుగ ఆడకమనీ నిరంతరంగా ప్రానికల్లుకున్న తీగలాగా కుటుంబాన్ని ఆశ్రయించుకుని ఉన్న పనివాళ్ళు. వీళ్ళుగాక చుట్టపుచూపుగా వచ్చి నాలుగు రోజులుండిపోయే బంధువులు. మామగారు శివారెడ్డి. ఆయనొక తాటాకుల మంట. అంతలో ఏనుగెక్కినంత సంతోషం, ఇంతలో పాతాళానికి కృంగినంత విచారం ఆయనకు! వృద్ధాప్యం ఆయనను ఇల్లు కదలనివ్వడం లేదు. ఆ లోపాన్ని భర్తీచేయడానికా అన్నట్టు హమేషా ఊళ్ళు తిరుగుతుంటాడు చిదానందం. సుమిత్రను కలవారి కోడలు కామాక్షితో ఉపమిస్తే, ఆమె భర్త రచ్చపైన (కాకపోతే రాజ్యం పైన) మెలిగే రాజేంద్రభోగి.

సుమిత్ర పడకపైన లేచికూర్చున్న అయిదు నిమిషాలకు తొలి కోడి కూసింది.

గదిలోనుంచి ఈవలికి వచ్చింది సుమిత్ర. గోడవార చాప వేసుకున్న రాజమ్మ గాఢ నిద్రలో ఉంది.

"ఇదిగో రాజమ్మా! కోడి కూసింది. అదనంగా మన తలంట్లపని ఒకటీ రోజు. లేవాలి మరి!"

"మొన్ననే వెళ్లినట్టుంది. మళ్లీ శుక్రవారం వచ్చేసిందటమ్మా!" అంటూ లేచి కూర్చుంది రాజమ్మ.

తలుపులన్నీ గడియ తీసుకుంటూ వసారాలోకి వెళ్లింది సుమిత్ర. తలుపు తీసిన చప్పుడు వినిపించగానే అరుగుపైన పడుకున్న పెద్ద పాలేరు నరసయ్య గూడా మేలుకున్నాడు.

"ఈ రోజేం పనులున్నాయి నరసయ్యా?" అంది సుమిత్ర.

"పనులు లేకేమండమ్మగారూ! నిన్న సాయంత్రానికి అడుసు దున్నడం ఆఖరయింది. ఈ రోజు తోపులో ఆకు కొట్టాలి. పది మంది కూలీ లొస్తారు..." కోడెలకు గడ్డి పెట్టడం కోసం కొట్టంవైపు బయల్దేరాడు నరసయ్య.

ఎప్పుడొచ్చిందో ఏమిటో సాయుబుల పిల్ల తహైరా అప్పుడే మేడ ముంగిట చెత్త ఊడ్చి కుండలో పేడనీళ్ళు కలుపుకుంటూంది.

"మీ అమ్మకు జ్వరం ఎలా ఉందే తహైరా! భద్రం, భద్రం. జాగ్రత్తగా చూచుకోవాలి నువ్వు. గంజికి నూకలు కావలిస్తే తీసుకెళ్ళు" అంది సుమిత్ర.

"మొన్న మీరిచ్చినవి ఇంకా ఉన్నాయండమ్మ గారూ! అయిపోతే మిమ్మల్నడక్క మరెవరిని అడుగుతాను" అంది తహైరా.

కొద్ది క్షణాల్లో శివారెడ్డిగారి మేడ 'కీ' ఇచ్చిన గడియారమైపోయింది. బావి దగ్గర గిలక చప్పుడు, పెరట్లో పాత్రల కదలిక, కొట్టంలో కోడెల మెడ పట్టెళ్ళకు కట్టిన చిరు గంటల మ్రోత...

సూర్యోదయాన్ని తిలకిస్తూ కిటికీ దగ్గర నిల్చుంది సుమిత్ర.

కొండ కోనలపైన వినీలగగనం. గగనాన్ని చుంబించే కొబ్బరితోటల మధ్య నాలుగు వందల కడపలున్న ఊరు. ఊరికంతా మోతుబరి శివారెడ్డి. తనా ఇంటి పెద్ద కోడలు. ఈ విశాల విశ్వంలో అదీ తన స్థానం! తనీ ఇంటిని ఎంత వరకూ చక్కదిద్దు కోగులుగుతుంది? ఎందరి మనసులకు ఆనందాన్ని పంచిపెట్టగలుగుతుంది? ఈ ప్రశ్నలకు కాలం ఇవ్వనున్న సమాధానం ఎలాంటిదో తన ఊహ కందటంలేదు...

ఆలోచనా స్రవంతి హఠాత్తుగా ఆగిపోయింది. మూరెడు పొడుగు కానుగపుల్లతో పళ్లు తోముకుంటూ ముసలాయన తోటలోనుంచి వస్తున్నాడు. ఆదరా బాదరాగా హాల్లోకి వెళ్ళి కిటికీ గుండా కొట్టం వైపు చూచింది సుమిత్ర. పసల కుర్రాడు పాలు పితుకుతున్నాడు. 'రక్షించాడు'- అనుకుంది సుమిత్ర. ముఖం కడుక్కున్న మరు నిమిషంలో కాఫీగ్లాసు కంటబడకపోతే ముసలాయన పరిస్థితి వర్ణనాతీతం! సంగ్రహంగా చెప్పాలంటే అప్పుడాయన అగ్గిమీద గుగ్గిలం.

వేళ తప్పకుండా కాఫీ తయారైంది. వంటలూ వార్పులూ కొనసాగుతున్నాయి. జాము ప్రొద్దెక్కింది. పోస్ట్‌మన్ రంగన్న టపా తీసుకొచ్చాడు. ఉత్తరాలు చదవడం పూర్తిచేసి దినపత్రిక తిరగవేస్తూంది సుమిత్ర...

"నమస్కారమండీ రెడ్డిగారూ!" ఖంగుమంటున్న కంచుగొంతుక.

"వచ్చేశారా సిద్ధాంతిగారూ! రండి, రండి." ముసలాయన స్వాగతం చెబుతున్నాడు. "మనిషిని పంపిస్తేగానీ వచ్చారుగారు. ఎలాగైతేనేం, రావడమే మాకు ముఖ్యం. కూర్చోండి, కూర్చోండి..."

ఆగంతకుడెవరో సుమిత్రకు బాగా తెలుసు. ఫామిలీ డాక్టరులాగా ఈయన ఫామిలీ జ్యోతిష్కుడు. ఇరవై మైళ్ల దూరంలో ఎక్కడో ఓ పల్లెటూళ్లో ఆయన నివాసం...

దినపత్రికను మడిచి టేబులుపైన ఉంచింది సుమిత్ర.

హాల్లో ప్రసంగం మళ్లీ ప్రారంభమైంది.

"కానీ, ఈసారి కుంటి జవాబులు చెబితే నే నూరుకోనండి సిద్ధాంతిగారూ! తాడో

పేడో తేల్చిగానీ మీరు వెళ్లడానికి వీల్లేదు. కాకపోతే ఏమిటయ్యా మీరు మరీనూ! వక్రదృష్టి అంటారు. కేంద్రవేధ అంటారు. ఆ గ్రహం ఏడ్చిందంటారు. ఈ గ్రహం పళ్ళికిలించిందంటారు. నిజమేనయ్యా నిజమే; అందుకేం చేయాలి బాబూ- అంటే బదులు చెప్పరు. అదేం జరగదండీ సిద్ధాంతిగారూ! కావలిస్తే మీరొకసారి జాతకాలన్నీ తిరగవేయండి. నాలుగు రోజులపాటు ఇక్కడే ఉండండి. అంతే నేను చెప్పగలిగింది..."

రెడ్డిగారి ధోరణి సిద్ధాంతిగారికి సుపరిచితమే! ఈయన నెంతటి పెడసరి ఘటమో, ఆయనంతటి లౌక్యుడు. "అలాగేనండి అలాగే! ఈసారి మీకు అన్ని వివరాలూ తృప్తికరంగా చెప్పిగానీ నే నిక్కడి నుంచీ కదలను..." అంటూ ఆయన తృప్తికరంగా సమాధానం చెప్పాడు.

ఒకటి రెండు నిమిషాలు మౌనంగా గడిచిపోయాయి.

రెడ్డిగారు మళ్లీ ప్రారంభించారు – "చూడండి సిద్ధాంతిగారూ! బ్రతుకన్న తర్వాత ఏవో విచారాలూ వెతలూ ఉండకపోవు. ఆమాత్రం నాకూ తెలుసు. కానీ తీరని విచారాలూ, ఆరని వెతలూ అయితే ఎలా భరించగలం చెప్పండి? ఇద్దరమ్మాయిలకు, ఇద్దరబ్బాయిలకు పెళ్ళిళ్ళు చేశానా? ముహూర్తాలు పెట్టింది మీరు. వశిష్ఠులవారికి రామాయణం చెప్పినట్టుంది నా కథ. అమ్మాయిలకు పెళ్ళిళ్ళయిన తర్వాత ఇది ఎనిమిదో ఏడు. పెద్దవాడికి పెళ్లయి నాలుగేళ్లు కావస్తున్నాయి. ఒక కడుపులోనైనా ఒక కాయ కాయగూడదటండీ సిద్ధాంతిగారూ! చివురుపెట్టని ఈ మోడుకొమ్మల మధ్య ఎలా బ్రతకమంటారు నన్ను? ఏం పాపం చేశానని నాకీ శిక్ష?"

గదిలో సుమిత్ర వేడిగా నిట్టూర్చింది.

"చిన్నవాడి సంగతి మీదాకా వచ్చిందో లేదో నాకు తెలియదు. నిరుడీలాంటప్పుడు వాడు కొత్త పెళ్లికొడుకు. పెళ్ళి ఏనాడు జరిగిందో అంతటితోసరి! వాడా పెళ్లాం ముఖం చూడలేదు. అదేమని నిలదీసి అడిగితే నాకిష్టంలేని పెళ్ళి నువ్వెందుకు చేశావంటాడు. ఆరు నెలలయింది వాడు ఇల్లు వదిలిపెట్టి! ఇంతవరకూ అజాపజా లేదు. బంగారం పండే పొలంలాంటి సంసారమండీ సిద్ధాంతిగారూ! దీనికీగతి ఎందుకొచ్చిందో మీరే చెప్పాలి..."

చరాలున పైకిలేచి మెట్లెక్కి మెడపైకి వెళ్ళిపోయింది సుమిత్ర. ప్రతిరోజూ ఏదో ఒక విధంగా వింటూ ఉన్న పురాణమే ఇది!

సుమిత్ర మానసాకాశంలో ఒకే ఒక ప్రశ్న హోరు హోరున గింగుర్లు తిరుగుతూ ఉంది. వాళ్లంటూ ఉంటే వింటూ ఉండడమేనా తాను చేయగలిగింది?

ఈ కాపురానికీ గతి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నకు సిద్ధాంతిగారు తమ శాస్త్రానికి సంబంధించిన పరిభాషలో ఏదో జవాబు చెప్పవచ్చు. ఆకాశంలోని నక్షత్రాలకు, భూమిపైన పుట్టి పెరుగుతున్న మానవులకు ఏవో లంకెలున్నాయని చెబుతుంది వారి శాస్త్రం. అందులోని నిజానిజాల సంగతి తనకు తెలియదు. తానూహించగలిగినంతలో తనకొక కారణం కొట్టవచ్చినట్టుగా స్ఫురిస్తుంది. కానీ, తన మాట నెవరూ వినిపించుకోరు. అథవా వినిపించుకున్నా తేలిగ్గా నవ్విపారేస్తారు...

తలపుల బరువుతో వాలుకుర్చీలోకి వాలిపోయింది సుమిత్ర.

సుమిత్ర స్మృతిపథంలో నాలుగేళ్లనాటి గాథ జడవానల్లో కొండవాగులా పరుగెడుతూంది.

ఆనాటి ఉదయం తిరుచానూరులో పెళ్లి జరిగింది. సాయంకాలానికల్లా బంధువులందరూ ప్రత్యేకంగా మాట్లాడుకున్న బస్సులమీద వరుడి స్వగ్రామానికి తరలివచ్చేశారు. రాత్రి ఎనిమిది గంటల వరకూ బడిలో మకాము. అప్పుడు బయల్దేరింది పెళ్లి ఊరేగింపు. పెట్రోమాక్సులైట్ల వెలుగు వెల్లువల్లో పెళ్లి ఊరేగింపు పూలతెప్పలా బయల్దేరింది. దక్షిణాది మేళగాళ్ల నాదస్వరాలు త్యాగయ్యగారి పాటల బాటల పైన శ్రోతలను ఆనందలోకాలకు తీసుకెళ్ళుతున్నాయి. కీలుగుర్రాలాడుతున్నాయి. ముద్దుల పెళ్లికూతురు సుమిత్ర కారు వెనుక సీట్లో భర్త సరసన కూర్చుంది. కదిరి నుంచీ మల్లె పువ్వులు తెప్పించి కారును హంసలా అలంకరించారు. పనిలో పనిగా ఆ కారు పెళ్లి ఊరేగింపులో రాయంచ నడకలు నేర్చుకుంటూంది. శరత్కాల సంధ్యాసమయంలో పచ్చటి నేలపైన మిలమిలలాడే లేలేత వెన్నెల వెలుగుల్లా సుమిత్ర అంతరంగంలో సిగ్గుదొంతరలు దోబూచులాడుతున్నాయి. బాగా తలవంచుకుని కూర్చుంది సుమిత్ర. జేబుగుడ్డను పెదవులకడ్డంగా ఉంచుకుని సుమిత్రకు మాత్రం వినిపించేటట్టుగా, "మరీ ఇంతగా తల దించుకుంటే వీళ్లందరూ ఎవరి ముఖం చూడాలని?" అంటూ కొంటెగా ప్రశ్నించాడు పెళ్లికొడుకు. మునిపంటితో కొరుక్కున్న చిరునవ్వు కలువ కళ్లల్లో నుంచీ పెల్లుబికి గులాబీ చెక్కిళ్లపైకి వ్యాపించగా సుమిత్ర మరింతగా సిగ్గుపడిపోయింది. పెళ్లి ఊరేగింపు సాగిపోతూంది...

పట్టుచీరతో, తలనిండుకూ పువ్వులతో, అరమోడ్పు కన్నులతో పుత్తడి బొమ్మలా కూర్చున్న సుమిత్రకు వీధిపొడుగునా ఇదివరకెన్నడూ చూచి ఎరుగని ముఖాలే కనిపిస్తున్నాయి. కొత్త ఊరికి వచ్చిన కొత్త కోడలి చుట్టూ ఆ ఊరివారి చూపులు బారులు కట్టుకున్న తుమ్మెదల్లా పచార్లు తిరుగుతున్నాయి.

ఊరేగింపు పడమటి వీధిగుండా వెళ్లుతూంది.

ఆ వీధిలో ఓ పెంకుటిల్లు, వాన నీటిలో తడిసి బయటి గోడలు నల్లబడిపోగా, వీధివైపు పిట్టగోడ కూలిపోగా, పైకప్పు తాలూకు పెంకులు సగానికి సగం విరిగిపోగా, దీపాలతో ముగ్గులతో వెల్లవేసిన గోడలతో కలకలలాడుతున్న గృహాల మధ్య చిన్నబోయి చీకటితో పొద్దువారినట్లున్న పెంకుటిల్లు...

ఆ ఇంటి ఎదుట ఓ అమ్మాయి...

ఆమె వయస్సెంతుంటుంది? చెప్పడం కష్టం. కట్టుకున్నది పాత చీర. బోసిగా ఉన్న మెడ. దువ్వుకోని శిరోజాలు. కదలికలేని కనురెప్పలు. అవి కళ్లుగావు, దుఃఖాలు కాపురం పెట్టుకున్న ఇళ్లు!

ఆమె చీకటిలో నిల్చుంది. పెట్రోమాక్సు దీపాలకాంతులు చీకటిని చీల్చుకుని విచ్చు కత్తుల్లా ఆమె పైకి దూకుతున్నాయి.

విద్యుద్ఘాతం తిన్నట్టుగా ఉలికిపడింది సుమిత్ర. ఉలికిపడిన క్షణంలో ఆమె కళ్లు పూర్తిగా విచ్చుకున్నాయి. ఆ పెంకుటింటి వసారాలో తన రుక్మిణి! ఆ చీకటింటి వసారాలో తన చిన్ననాటి నేస్తం! సుమిత్ర తన కళ్లను తానే నమ్మలేకపోయింది.

"నువ్వేనా రుక్మిణీ! నువ్విక్కడున్నావా రుక్మిణీ!" అంటూ స్నేహితురాలిని పలకరిస్తున్నట్టే భ్రమించింది సుమిత్ర.

పలకరించకపోతేనేమి, సుమిత్ర చూపులు పూలగుత్తుల్లా, పన్నీటి చిలకరింపుల్లా ఆ అమ్మాయిని స్పృశించాయి.

ఒక క్షణం అలా గడిచింది. రెండో క్షణం గూడా అలాగే గడిచింది. మరుక్షణంలో తెల్లటి కాగితం నడుమ నల్లటి బొమ్మలా దీపకాంతుల మధ్య ప్రత్యక్షమైన ఆ పరిదీనమూర్తి గిరుక్కున వెనుదిరిగి చీకటిలోకి జారిపోయింది.

ఆ ఒకటి రెండు క్షణాల వ్యవధిలోనే సుమిత్ర ఆ అమ్మాయి కళ్లల్లో గిర్రున తిరుగుతున్న కన్నీటిని చూడగలిగింది. ఆమె ముఖంలో గూడుకట్టుకున్న విషాద భావాలను పసిగట్టగలిగింది.

దారి ప్రక్కన తారసిల్లిన ఒకానొక దీనురాలిని గురించి పట్టించుకోకుండా, ఆమెకోసం ఆరాటపడుతున్న సుమిత్ర కోసం ఆగకుండా ఊరేగింపు ముందుకు సాగిపోతూంది...

కానీ, సుమిత్ర ఆలోచనలు మాత్రం ఆ పెంకుటింటి దగ్గరే ఆగిపోయాయి.

ఈ ఊళ్లో ఎందుకుంది రుక్మిణి? ఇక్కడామె కెవరున్నారు? ఆ ఇంట్లో ఏం చేస్తూంది రుక్మిణి? ఎలా బ్రతుకుతూంది? చిట్టచివర అన్నిటికన్నా క్లిష్టమైన ప్రశ్న – స్నేహితురాలికి

పెళ్లి జరుగుతూంటే కంట నీరు పెట్టుకోవలసినంతగా కష్టాలేమొచ్చాయి రుక్మిణికి?

ఆనాటి రాత్రి పెళ్లి వేడుకలన్నీ ముగింపు కొచ్చేశాయి. మళ్లీ నాలుగు రోజుల్లో పెళ్లి సందడిగూడా తగ్గిపోయింది. ఓ రోజు సాయంత్రం చీకట్లు చిందులు త్రొక్కుతూ వచ్చి లోకాన్ని ముట్టడించాయి. వంటలక్క రాజమ్మను వెంటబెట్టుకుని పెరటిదారి గుండా సుమిత్ర పడమటి వీధిలోకి వచ్చింది. అక్కడి నుంచీ గమ్యస్థానానికి ఎంతోదూరం లేదు. రాజమ్మను వసారాలో కూర్చోబెట్టి ఒంటరిగా పెంకుటింట్లో ప్రవేశించింది సుమిత్ర.

రెండు గదుల మధ్యగా వెళ్లుతున్న దారికి చివర నడవలోకి తెరచుకుంటున్న ద్వారం దగ్గర నిల్చుని సుమిత్ర లోపలికి చూచింది. అక్కడొక దిగుడులో మట్టి ప్రమిదలోని పత్తి వత్తి గుడ్డిగా వెలుగుతూంది. నడవ కావలి భాగం నివాసయోగ్యంగా ఉన్నట్టులేదు. మట్టి బెడ్డలు ఊడిపోతున్న గోడలు వీలైనంత వికృతంగా ఉన్నాయి. పైకప్పులో నుంచీ అక్కడక్కడా ఆకాశం కన్పిస్తూంది. ఆ రంధ్రాలగుండా వాన నీటికి ఇంటిలోపల గూడా ఆశ్రయం దొరుకుతుందేమోమరి –తేమ తగిలి పాదాలు జిల్లుమంటున్నాయి.

పిలిస్తే పలికేటంత దూరంలో రాజమ్మ ఉందన్న స్పృహే లేకపోతే మానవాకారం లాంటి దేదీ కానరాని ఆ చీకటి గుయ్యారంలో సుమిత్ర అలా ఎంతోసేపు నిల్చోగలిగేది గాదు.

ఎంతకూ అలికిడి వినిపించకపోయేసరికి "ఎవ్వరూ లేరటమ్మా?" అని సుమిత్రను పలకరిస్తూ రాజమ్మ కూడా లోపలికి వచ్చేసింది.

"ఎవరు? ఎవరహ్...క్కడ?" ఆ ప్రశ్న ఉప్పెనలా గొంతుకను పెగల్చుకొని వచ్చిన దగ్గులో పర్యవసించింది.

అందాకా ఆ నడవలో తన చూపులకు ఆనకుండా నీడలో ఉండిపోయిన నులక మంచం ఒకటి ఆ క్షణాన సుమిత్రకు లీలగా పొడగట్టింది. నిలువునా దుప్పటి కప్పుకుని ఆ మంచంపైన పడి ఉన్న వృద్ధుడు లేచి కూర్చోడానికి ప్రయత్నిస్తూ పైకి లేవనీకుండా క్రిందికి పడదోస్తున్న దగ్గుతో ఘర్షణ పడుతున్నాడు.

ఓ అడుగు ముందుకు వేసింది సుమిత్ర.

చివరి కెలాగైతేనేం, ఆ వృద్ధుడు లేచి కూర్చున్నాడు. బట్టగట్టిన తల. చెంపలపైన తెల్లటి గడ్డం. లోతుకుపోయిన కళ్లు. శిఖరం లాంటి ముక్కు అస్థిపంజరంపైన చర్మపు తొడుగులాంటి ఆకారం...

మళ్లీ ఒకసారి మాట్లాడి ఆ ముసలి ప్రాణం దగ్గును కొనితెచ్చుకోవలసిన అవసరం లేకుండా, "రుక్మిణికోసం వచ్చానండీ తాతగారూ" అంటూ బదులు చెప్పింది సుమిత్ర.

"రుక్మిణి కోసమా! చూపు సరిగ్గా తెలియడం లేదు. ఎవరమ్మా నువ్వు?"

"మా దీ ఊరుకాదండీ తాతగారూ! కొత్తగా ఇక్కడికి వచ్చాను. రుక్మిణీ, నేనూ ఒక బడిలో కలిసి చదువుకున్నాము. రెండు మూడేళ్లపాటు అక్క చెల్లెళ్లలా మెలిగాము..."

"ఐతే మీది గూడూరన్నమాట! కూర్చోమ్మా కూర్చో. రుక్మిణి వైద్యుడికోసం వెళ్లింది. వెళ్లిన సమయానికి అతగాడింట్లో ఉంటే ఈపాటికి మందు తీసుకుని వచ్చేస్తూ ఉంటుంది." మళ్లీ దగ్గుతెర. మహా ప్రభంజనంలో పండిన వెదురు జొంపంలా ఊగిసలాడిపోతున్న ఆ ముసలివాడివైపు చూడలేకపోయింది సుమిత్ర.

దగ్గుతెర విడిపోయి మళ్లీ కాస్తా ఓపరికం చిక్కగానే వృద్ధుడు సుమిత్రవైపు తిరిగాడు. ఓసారి ఎగాదిగా చూచి "పెళ్లయిందా తల్లీ?" అంటూ నీరసంగా ప్రశ్నించాడు.

"అయిందండీ తాతగారూ!" ముక్తసరిగా ప్రత్యుత్తరం చెప్పింది సుమిత్ర.

"ఎందుకు కాదమ్మా! అందరూ నాలాంటి దరిద్రులే ఉంటారా ప్రపంచంలో? అదృష్టవంతులు గూడా ఉంటారు..." ఎడమచేతి వ్రేళ్లతో ఫాలతలాన్ని రాచుకుంటూ చెప్పుకుపోతున్నాడు వృద్ధుడు. "ఒక్కగా నొక్క కూతురు నాకు – రుక్మిణి! చిన్నప్పుడే తల్లి చనిపోయింది. పెంచి పెద్ద జేశాను. నా తమ్ముడొకడు గూడూరులో గవర్మెంటు నౌఖరీ చేస్తూండేవాడు. చదువుకోసమని అమ్మాయిని వాడి దగ్గర దిగవిడిచాను. తలగడుగులకు పోగానే వడగళ్ల వాన వచ్చింది. కలరా తగిలి వాడు కళ్లు మూసుకుపోవడంతో ఆ కాపురం గూడా చిందరవందరైపోయింది. నాటి నుంచీ ఈ ముసలి పీనుగతో వేగుతూ వేళకు తిండిలేక, ఒంటినిండుకూ బట్ట లేక అమ్మాయి క్రుంగి కృశించిపోతూంది. నీబోటి వాళ్లెవరైనా వస్తే క్రిందికి వేయడాని కొక చాపయినా ఈ ఇంట్లో లేదు. ఇక కట్నాలూ కానుకలూ ఎక్కడి నుంచీ తీసుకొస్తాను? ఈ ముదనష్టపు వాడికి కన్యాదానఫలం కూడానా! లేవమ్మా లేవు. ఆ ఆశలు లేనేలేవు..."

వృద్ధుడి కంఠం గద్గదికమైపోయింది. కనుగొలకుల్లో కన్నీళ్లు నిలిచాయి.

"కానీ ఒకప్పుడు ఆశలుండేవి. ఉండబట్టే పదేళ్లు పోరాడాను. ఏం లాభం తల్లీ? కొండతో పొట్టేలు తలపడితే ఏమవుతుంది? ఏడెనిమిదేళ్లు క్రింది కోర్టుల వెంట తిరిగాను. చివరకు హైకోర్టుకు గూడా వెళ్లాను. డబ్బున్నవాడు సాక్ష్యాలు తయారుచేయగలడు. మనుషుల్నే కొనేయగలడు. నాచేత నేమవుతుంది? అప్పులపాలై పోయాను. చిప్ప చేతికొచ్చింది. ఈ ఊరి కొచ్చావు గనుక నువ్వూ వినే ఉంటావు. అతగాడి పేరు శివారెడ్డి. కొండంత రెడ్డి. నాదేమో అయిదెకరాల నేల. ఆ పొలం నా చేతిలో ఉంటే అమ్మాయికో దారి చూపెట్టగలిగి ఉండేవాణ్ణి. చెరువులకు చెరువులే ఆ రెడ్డివి. తోపులకు తోపులే ఆ

రెడ్డివి. నా నాలుగు కయ్యలూ లేకపోతే అతగాడికి తరిగిపోయేదేమీ లేదు. నా అదృష్టం కొద్దీ, ఆయన కన్ను నా నేలపైన పడింది. ఇంతవరకూ దయదలిచి ఊరుకున్నారు గానీ అప్పులవాళ్లు ఎప్పుడో ఒకప్పుడు ఈ ఇంటిని వేలం పాడేస్తారు. నాకట్టె ఏం శాశ్వతం? ఇది మట్టిపాలవుతుంది. నా బిడ్డకీ లోకంలో దిక్కుండదు. ఎంత పుణ్యం, ఎంత పుణ్యం, ఎంత పుణ్యాన్ని ఆర్జించాడో చూచావా తల్లీ!"

అప్రయత్నంగా రెండడుగులు వెనక్కువేసింది సుమిత్ర. ములుకుల్లాంటి పలుకులు ఆమె ఎదలో గ్రుచ్చుకుంటున్నాయి. దిమ్మెక్కిపోయిన తలపైన పిడుగులు వర్షిస్తున్నాయి. వృద్ధుడు సుమిత్రవైపు చూడటం లేదు. రెండు చేతులతో తలను గట్టిగా అదిమి పట్టుకుని పైకప్పుకేసి చూస్తున్నాడు. అతడి కళ్లల్లో నుంచీ ఉన్మాదపు ఛాయలు తొంగిచూస్తున్నాయి.

"ఇదిగో నేను చెబుతున్నాను. ఊరివారి బిడ్డను నగరివారు కొడ్తే నగరివారి బిడ్డను నారాయణుడు కొట్టకుండా ఉండడు. విషపల్లు ముండావాణ్ణి నేను! నా శాపం ఊరికే పోదు. ఆ ఇంట దీపం నిలవదు. ఆ వంశం వృద్ధికాదు..."

సుమిత్ర ఒడలిపైన తేళ్లూ, జెర్రులూ ప్రాకుతున్నట్టున్నాయి. ఆమె దాదాపుగా బాహ్య స్మృతిని గోల్పోయింది. ఆ ఇంటిలో నుంచి తనెలా బయటపడిందో ఆమెకు తెలియదు. ఏ విధంగా స్వగృహానికి చేరుకుందో ఆమెకు తెలియదు.

కళ్లు మూసుకుంటే చాలు ఆ వృద్ధుడి రోగశయ్య ఆమె మనోనేత్రాల ఎదుట ప్రత్యక్షమవుతుంది. ఉండి ఉండి అతడి శాపవాక్కులు ఆమె చెవుల్లో ఫీంకారాలు సల్పుతాయి. వారం పది రోజులకు గానీ ఆమె మామూలు మనిషి కాలేకపోయింది.

ఓ రోజున చిదానందం ప్రశ్నించాడు గూడా! "కొద్ది రోజులనుంచీ పరధ్యానంగా ఉన్నట్టున్నావేం సుమిత్రా! ఏమిటీ విశేషం?" అని.

సుమిత్ర అవకాశాన్ని సద్వినియోగం చేసుకోదలిచింది. రుక్మిణితో తన చిన్ననాటి స్నేహం దగ్గరి నుంచీ మొదలుపెట్టి ఇటీవలి పతాక సంఘటనదాకా కథంతా పూస గ్రుచ్చినట్టుగా చెప్పింది.

అంతా విని ఒక్కపెట్టున బిగ్గరగా నవ్వేశాడు చిదానందం. "ఇదేమిటి సుమిత్రా! నువ్వింతటి పిచ్చిదానివని అనుకోలేదు నేను! ఆస్తి పాస్తులకు సంబంధించి ఏవో వ్యవహారాలు వస్తాయి. రావడం సహజం! వచ్చాక న్యాయాన్యాయాలను విడమరిచి చెప్పడానికి న్యాయస్థానాలున్నాయి. కోర్టులో మన పక్షాన తీర్పు జరిగింది గనుక మనది న్యాయమేనన్నమాట! ఇందులో మనం చేసిన అక్రమ మేముంది? ఏమీలేదు. ఇక వాళ్ల శాపనార్థాల సంగతంటావా! తిట్టుకోనీ, మనదేంపోయింది! పిల్లి శాపాలకే ఉట్లు తెగిపోతాయా?"

నిరుత్తరురాలైపోయింది సుమిత్ర. మొదట భర్తవాదం సత్యసమ్మతమే ననిపించినా రానురానూ ఆమెలో కొత్త కొత్త సందేహాలు రగులుకోసాగాయి. ఈ లోకంలో న్యాయంగా భావింపబడుతున్న దేదైతో ఉందో అదొక క్లిష్టమైన విషయంలా ఉంది. ఆ న్యాయానికి కళ్లేగానీ హృదయం ఉన్నట్టులేదు. ఒక్కొక్కప్పుడు ఆ కళ్లు గూడా లోపించి చెవులు మాత్రమే మిగిలేటట్టున్నాయి. ఏది న్యాయం? వెర్రిబాగుల హరిశ్చంద్రుణ్ణి ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు త్రాగించిన విశ్వామిత్రుడిది న్యాయం కాదని ఎవరు చెప్పగలరు? కాగితంలో వ్రాసి ఇచ్చిన మేరకు అప్పు తీసుకున్న వాడిని వాడి శరీరంలో నుంచీ వీశెడు మాంసం కోసి పెట్టమన్న వెనీస్ వర్తకుడిది న్యాయం కాదని ఎవరు చెప్పగలరు? అమ్మో, కఠిన పాషాణంకంటే కర్కశమైనదీ న్యాయం. తానొక న్యాయాధీశుడులా సర్వకాల సర్వావస్థల్లోనూ న్యాయానికే అంటిపెట్టుకుని ఉన్నట్టు తలపోస్తున్నాడు ఆధునిక మానవుడు. మనో వాక్కాయ కర్మల ద్వారా మానవుడు చేస్తున్న నేరాలకు అప్పటికప్పుడే సముచితమైన శిక్ష అనుభవించి తీరాలని భగవంతుడొక చట్టం జారీచేస్తే, ఆ చట్టం ఉద్భవించిన తర్వాత అయిదు నిమిషాలకు ఈ ప్రపంచంపైన నరజాతి మచ్చుకైనా మిగలదు. భగవంతుడు దయా సముద్రుడు, కరుణామయుడు. ఆ భగవంతునికి ప్రతినిధినని చెప్పుకుంటున్న మానవుడు, ఆ భగవంతుని అంశ తనలో ఎక్కువగా ఉందని గర్వపడుతున్న మానవుడు శుష్కమైన న్యాయం పేరిట తోటి మానవుడి బ్రతుకుపైన నిప్పులు చల్లడంకన్నా దారుణం వేరొకటి లేదు...

తాను స్వయంగా రూపొందించుకున్న ఈ వాదంతో భర్తవాదాన్ని పూర్వపక్షం చేయడానికి గూడా సుమిత్ర వెనుదీయలేదు.

ఈసారి చిదానందం నిరుత్తరుడైపోయాడు. కాసేపు నీళ్లు నమిలి "ఈ గొడవ మనకెందుకులే సుమిత్రా! మా నాన్నగారొకరు చెబుతే వినేవాళ్ళుకారు" అంటూ తప్పించుకున్నాడు.

గడచిపోతున్న కాలం వృద్ధుడి శాపవాక్కులకు జీవం పోస్తూంది.

ఈనాడు మామగారు సిద్ధాంతిగారిని పిలిపించి తన కాపురాని కీ దుర్దశరావడానికి హేతువేమిటో తేల్చి చెప్పమంటున్నారు.

రోగానికి సరైన మందేదో నిర్దేశించి చెప్పగలరా సిద్ధాంతిగారు?

◆ ◆ ◆

సిద్ధాంతిగారికి నిద్ర పట్టడం లేదు.

మహిడీకి యాభైగజాల దూరంలో ఏకాంతంగా కాలం గడపడానికని చిదానందం కట్టించుకున్న 'అవుట్ హౌస్'లో బసచేశారు సిద్ధాంతిగారు. కాలక్రమాన చిదానందానికీ ఏకాంతానికీ అంతగా సరిపడకపోవడంతో ఆ ఇల్లు ప్రస్తుతం వ్యవసాయోపకరణాలకు నిలయంగా, ధాన్యాగారంగా, అతిథులకు విడిదిగా, ఇంకా రకరకాలుగా వినియోగ పడుతూంది.

ఈవలా ఆవలా రెండు రెండ్ల నాలుగు గదుల మధ్యగా పెద్ద హాలు. తోటలో నుంచీ గాలి ధారాళంగా లోపలికి వీస్తూంది. నల్లులు, దోమలు మొదలైన క్రిమికీటకాల బాధ బొత్తిగా లేదు. శయ్యగూడా సుఖప్రదంగానే ఉంది. ఐనా సిద్ధాంతిగారికి నిద్ర పట్టడంలేదు!

సిద్ధాంతిగారికి నిద్ర పట్టకపోవడానికి కారణాలు రెండు-

ఒకటి: నిర్విరామంగా జాతకాలు పరిశీలించడం వల్ల కలిగిన శిరోభారం, రెండు: ఎక్కడి నుంచి వస్తూందో మరి, నాసికా రంధ్రాలకు ఏమాత్రం సహ్యంగాకుండా ఉన్న దుర్వాసన.

అందుకని పైకిలేచి రెక్క తలుపుల గుండా ప్రతి గదిలోకీ తొంగి చూడడానికి ప్రయత్నించారు సిద్ధాంతిగారు. ఆయన కళ్లకు చిమ్మచీకటి వినా మరొకటి కానరాలేదు.

సిద్ధాంతిగారు మళ్ళీ పడకపైన మేనువాల్చారు.

గంట పది కావస్తూంది.

ఊరంతా మాటు మణిగింది.

రెడ్డిగారి మేడలో గూడా మనుషుల కలకలం తగ్గింది.

అప్పుడప్పుడే ఓ కునుకు దూరదూరాల నుంచీ వినవస్తున్న కమ్మటి రాగాలాపనంలా సిద్ధాంతిగారి మానసిక చైతన్యం చుట్టూ తెరలు దించుతూంది.

ఎవరో తట్టి మేల్కొలుపుతున్నట్టుగా తోచి తటాలున లేచి కూర్చున్నారు సిద్ధాంతిగారు.

తడుతున్నది తమనుగాదు - తలుపును.

గబగబా వెళ్ళి ఆయన తలుపు తీశారు.

ద్వారంలో నుంచీ ఆవలికి పడుతున్న దీపకాంతి కడ్డంగా ఇద్దరు స్త్రీలు...

"నేనేనండి బాబుగారూ! రాజమ్మను. చిన్నమ్మగారు మీతో మాట్లాడాలంటే పిల్చుకొచ్చాను."

సిద్ధాంతిగారు విస్తుపోయారు. కానీ తమ హావభావాల్లో ఆశ్చర్యం ప్రకటితం గాకుండా జాగ్రత్త పడుతూ "అలాగా! రా తల్లీ! లోపలికి వచ్చి కూర్చో" అన్నారు.

రాజమ్మ ద్వారం దగ్గరే నిల్చుంది. సుమిత్ర సిద్ధాంతిగారి కల్లంత దూరంలో గోడవారగా కూర్చుంది.

"మీతో ఓ విషయం చెప్పుకోవాలనిపించింది. పగటివేళ మీరు ఒంటరిగా ఉండరు... అందుకని..." అంటూ అర్థోక్తిలో ఆగింది సుమిత్ర.

"దానికేమమ్మా! నిరభ్యంతరంగా చెప్పుకోవచ్చు. ప్రత్యేకంగా జాతకం చూపించుకోవాలనుకున్నావా ఏమిటి?" అన్నారు సిద్ధాంతిగారు.

"జాతకాల పిచ్చి నాకు మరీ అంత ఎక్కువగా లేదని చెబుతే మీరు కోప్పడుతారేమో..." జంకుతో సిద్ధాంతిగారివైపు చూచింది సుమిత్ర.

సిద్ధాంతిగారు గబగబా నవ్వేశారు. "భలే దానివమ్మా నువ్వు! నా కెందుకు కోపం? ఈ విచిత్ర ప్రపంచంలో ఎవరి పిచ్చివాళ్ల కానందం. ఒకరికి జాతకాల పిచ్చి, మరొకరికి సాముద్రికం పిచ్చి, ఒకడికి పక్షిశాస్త్రం, ఇంకొకడికి మంత్రశాస్త్రం. కానీ ఒకడి పిచ్చి వేరొకడి ఉదరపోషణకు దారి జూపుతున్నంతకాలం ఆ పిచ్చివల్ల లోకానికి ఉపకారం జరుగుతున్నట్టే కదా?"

నివ్వెరపడిపోయింది సుమిత్ర. అయినా అంతలో తేరుకుని, "అలాగని నేను జ్యోతిషశాస్త్రాన్ని అధిక్షేపిస్తున్నాని మీరు భావించగూడదు..." అంటూ క్షమాపణ చెప్పుకుంది.

"అబ్బే, నే నలా ఎందుకనుకుంటానమ్మా? నమ్మినవాడికి దేవుడు, నమ్మకపోతే రాయి. శాస్త్రం గూడా అంతే! నా శాస్త్రం మీద మీ మామగారి కెందుకో చెప్పరానంత గురి. అప్పటికి నేనేమో ఇంద్రజాలికుడినైనట్టు, తీరని కొరతలకు తిరుగులేని నివారణోపాయాలు కనిపెట్టగలనని ఆయన ఆశిస్తారు. నిజానికిందులో నేను మాత్రం చేయగలిగిందేముంది? లేదంటే శాంతి హోమం చేయాలంటాను. లేదా నవగ్రహ పూజ జరపాలంటాను, అదీగాకపోతే అన్నదానమో, గోదానమో..."

అడ్డు తగిలింది సుమిత్ర – "పోనీ భూదానం చేయమంటే?"

"భూదానమా?" వింతగా సుమిత్ర ముఖంలోకి చూచారు సిద్ధాంతిగారు.

"అసలు విషయంలోకి వస్తున్నాను. మా మూలంగా ఓ కుటుంబానికి అపకారం జరిగింది. ఆ కుటుంబాని కుండిన ఏకైకాధారం అయిదెకరాల నేల. ఆ పొలంపైన వాళ్లకూ వీళ్లకూ వ్యవహారం వచ్చింది. పదేళ్లు కోర్టుల వెంట తిరిగిన తర్వాత తీర్పేమో వీళ్ల కనుకూలంగానే జరిగింది. కానీ, ఏ ఆస్తిలేకపోతే ఆ కుటుంబం నడివీధి పాలవుతుందో, ఆ ఆస్తి మాకు వద్దేవద్దని నా ఉద్దేశ్యం..."

సిద్ధాంతిగారు ఆలోచనలో పడ్డారు. ఒకటి రెండు నిమిషాలు మౌనంగా గడిచిపోయిన తరువాత ఆయన "అయితే, మీ కాపురంలో ఇటీవల ఏర్పడిన పరిణామాలకు, ఆ కుటుంబానికి జరిగిన అపచారానికి కార్యకారణ సంబంధాన్ని ఊహిస్తున్నావటమ్మా నువ్వు?" అన్నారు.

ఈ ప్రశ్నకు జవాబు చెప్పడానికి ముందుగా సుమిత్ర కాసేపు ఆలోచించుకోవలసి వచ్చింది.

"ఒకసారిగాదు. లెక్కలేనన్నిసార్లు నాకూ అదే అనుమానం కలిగింది. అనుమానం కలిగినప్పుడల్లా నేను ఆలోచిస్తూ కూర్చునేదాన్ని! కొండ ఊట నీళ్లు త్రాగితే జలుబు పడుతుండగా, వానలో తడిస్తే జ్వరం వస్తూండగా, మితిమీరి ధూమపానం చేస్తే క్షయ రోగం తప్పనిసరిగా ఇక చేయరానిపని చేస్తే, అందుకు ఫలితం అనుభవించవలసిన అవసరం లేదనుకోడం ఎంతవరకూ సబబు? నేను చెబుతున్న కుటుంబంలో ఓ అమ్మాయి ఉంది. ఆమెకూ ఇంచుమించు నా ఈడే ఉంటుంది. కానీ, ఇంతవరకూ ఆమెకు పెళ్లికాలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆమె కింక పెళ్ళయ్యే సూచనలు గూడా లేవు. జలాశయాల్లో నుంచీ ఉద్భవిస్తున్న నీటి ఆవిరి ఆకాశాని కెగబ్రాకి అక్కడ మేఘాలుగా రూపొందుతూండగా ఆ అమ్మాయి మనసులో రగులుకుంటున్న నిరాశల పొగలు, నిట్టూర్పుల సెగలు వృథా కాగలవనుకోగలిగే పాటి సాహసం నాకు లేదు. పైకి విసరిన రాయి అలాగే పైకెగిరిపోకుండా భూమిపైన పడుతున్నందుకు గూడా ఓ కారణాన్ని చెబుతుంది ఆధునిక విజ్ఞానం. భూమ్యాకర్షణ శక్తిలాగే అనేక సంఘటనలకు వాటి వెనుక నున్న కారణాలు కళ్ళకు కనిపించవు. కానీ, అవి బుద్ధికి భాసిస్తాయి. అంతెందుకూ? మీ కొక చిన్న నిదర్శనం చెబుతాను. ఆ పొలంపైన మా హక్కు స్థిరపడి అయిదారేళ్లు కావస్తున్నాయి. ఈ అయిదారేళ్ళలో మాకా పొలం మూలంగా లభించిన రాబడి అక్షరాలా పూజ్యమేనంటే మీరు నమ్మరు. కానీ ఆ మాట నిజం. ఒక సంవత్సరం కలుపు తీయకముందే చీడ తగిలి పైరంతా పాలిపోయింది. మరు సంవత్సరం వెన్నుపోతూండగా బావిలో నీళ్లు వట్టిపోయాయి. ఇలాకాదని చెరకు పైరు చేయమన్నారు మామగారు. చేస్తే ఏమైంది? పైరేమో ఏపుగా కొబ్బరి తోటలా పెరుగుతుంది. కానీ తీరా గానుగాడేసరికి బానలు కావలసి వస్తాయి. ఆ పాగు ముద్దలకు కుదరదు. తీసితీసి బానలకుపోయవలసి వస్తుంది. కొనేవాళ్లు లేక, ఆ వాసనకు భరించలేక చిట్టచివరకలాగే ఆ బానలను తీసుకెళ్లి దిబ్బగుంతలో దిమ్మరించడం జరుగుతూంది. ఈ హాల్లో మీరెలా పడుకోగలిగారో నాకు తెలియడం లేదు. అదిగో, ఆ గది నిండుకూ అలాంటి పెద కడవలే ఉన్నాయి..."

సిద్ధాంతిగారు నిర్ఘాంతపోయారు.

సుమిత్ర మళ్లీ ప్రారంభించింది. "మీరు మా కుటుంబానికి శ్రేయోభిలాషులు. ఈ సాయంచేస్తే మరొక కుటుంబాన్ని నిలబెట్టిన వాళ్లవుతారు గూడా!..."

"కానీ నువ్వు సూచిస్తున్న భూదానంవల్ల ఆ కుటుంబానికెలా మేలు జరుగుతుందమ్మా! అదీ చెప్పు" అన్నారు సిద్ధాంతిగారు.

"నూటికి తొంభైతొమ్మిది వంతులు మేలు జరుగవచ్చుననే నా ఆశ. మీరు భూదానం ప్రసక్తి తీసుకొస్తే, మామగారికా పొలం సంగతి జ్ఞప్తికి రాక తప్పదు. నాలుగేళ్ల నుంచీ అది అచ్చిరాని నేలన్న నమ్మకం ఆయనలో దృఢపడిపోతూంది. మీరు కథనందాకా లాక్కొస్తే మిగిలిన భాగాన్ని సర్దుబాటు చేసుకోవచ్చునన్న నమ్మకం నాకుంది. ఎలాగూ దానం చేయాలన్న నిర్ణయానికి వస్తారు గనుక ఎవరికో దారంట వెళ్లే దానయ్య కివ్వడం కన్నా ఆదిలో ఆ పొలం ఎవరిదో వాళ్లకే దాన్ని ముట్టజెప్పడం మంచిదన్న భావాన్ని మామగారిలో కలిగించవచ్చుననే నేననుకుంటున్నాను. ఈ విషయంలో నాకెలాగూ మావారి తోడ్పాటు ఉండనే ఉంటుంది..."

"ఓహో, చిదానందాన్ని గురించి చెబుతున్నావటమ్మా! అతగాడి సంగతి నాకు తెలుసు. అతడు నువ్వెంత చెబితే అంత! ఇప్పుడు మనకొచ్చిన తంటా అంతా ఈ ముసలాయనతోనే!" సిద్ధాంతిగారు మళ్లీ నవ్వసాగారు.

"అందుకు మీరుండనే ఉన్నారు" అంది సుమిత్ర.

"అబ్బే, నాదేముందమ్మా! నేను నిమిత్తమాత్రుణ్ణి, ఈ నాటకానికి సూత్రధారిణివి నువ్వు. నిన్నెలా పొగడాలో నాకు తెలియడం లేదు..."

"మీరు పెద్దవారు, మీ పొగడ్తకు నేను అర్హురాల్నికాను", లేచి నిల్చుంటూ ద్వారంవైపు చూచింది సుమిత్ర.

తాంబూలంతో, కొత్త ధోవతులతో నిండిన పళ్ళెరాన్ని తీసుకొచ్చి సుమిత్ర చేతి కందించింది రాజమ్మ.

పళ్ళెరాన్ని సిద్ధాంతిగారి పాదాల ముందుంచి నమస్కరించింది సుమిత్ర.

"ఆశయ సిద్ధిరస్తు. పుత్రపౌత్రాభివృద్ధిరస్తు!" నిండు మనసుతో దీవించారు సిద్ధాంతిగారు.

(ఆంధ్రప్రభ వార పత్రిక-13-12-1961)

❀ ❀ ❀